
# జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆర్వో ప్లాంట్ మరమ్మత్తులకు ఆర్థిక సహాయం



**కందుకూరు శిఖర జనసాక్షి:** కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ గత కొన్ని రోజులుగా సాంకేతిక లోపంతో పనిచేయక నిలిచిపోయింది. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకున్న ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి రూ 21,500 ఆర్థిక సాయాన్ని అందించింగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆర్వో ప్లాంట్‌కు పునర్వైభవం తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆర్వో ప్లాంట్ సక్రమంగా పనిచేస్తూ, విద్యార్థులందరికీ స్వచ్ఛమైన, సురక్షితమైన ల్యాబ్ ప్రమాణాల ప్యూరిఫైడ్ తాగునీరు తగినంతగా అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని, పాఠశాల వదిలి దశాబ్దాలుగడిచినా, చదువుకున్న విద్యాసంస్థపై మా కున్న మమకారం, సామాజిక బాధ్యత, ప్రస్తుత విద్యార్థుల పట్ల చూపిన వాత్సల్యంతో ఆదర్శనీయంగా ఈ నిస్వార్థ సేవ కార్యక్రమం చేయడం జరిగిందని తెలిపారు. ఇది వర్తమాన విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల వికాసంలో భాగస్వాములైన 1973-74 పూర్వ విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తరఫునహృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలను తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**వలేటివారిపాలెం శిఖర జనసాక్షి:** వలేటివారిపాలలెం మండలం అయ్యవారిపల్లి-మాలకొండ మధ్య 167బి జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళున్న ఇద్దరిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని 108 సిబ్బంది కందుకూరు ఏరియా ఆసు పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను కూడా మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వలేటివారిపాలెం ఎస్సై ప్రేమ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల వివరాలు, ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేత బసిరెడ్డిపాలెం జడ్పీహెచ్ఎస్




**గుడ్లూరు శిఖరజనసాక్షి:** జ్ఞానవిజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో బసిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలను ఎంఈఓ గోవర్ధన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్‌రావులు ప్రశ్నపత్రాలను ఆవిష్కరించి ప్రారంభించారు. జెవివి మండల నాయకులు దామా సోమా నాయుడు, సాలి సూర్యనారాయణ, గొర్రెపాటి మధు, బివిఎల్ఎన్ మూర్తిలు ఈ పోటీలను నిర్వహించారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో స్కూల్ లెవెల్‌లో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మండల మండల స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బసిరెడ్డి పాలెం విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ద్వితీయ స్థానంలో అభ్యుదయ హైస్కూల్ విద్యార్థులు, చైతన్య హై స్కూల్ విద్యార్థులు నిలిచారు. ఎంఈఓ గోవర్ధన్ వారికి బహుమతులను అందజేశారు. ఈ టెస్టులో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్.ఎస్, గుడ్లూరు, జడ్పీహెచ్ఎస్, చినలాటరపి, జడ్పీహెచ్.ఎస్, అడవిరాజుపాలెం, జడ్పీహెచ్ఎస్ బసిరెడ్డిపాలెం, జడ్పీహెచ్.ఎస్, తెట్టు, అభ్యుదయ హైస్కూలు, శ్రీ చైతన్య హైస్కూలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, జి.రాజా, కలగారెడ్డి, ఎల్లావుల మాల్యాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వల్లూరమ్మ దేవస్థానంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం









**టంగుటూరు శిఖర జనసాక్షి:** టంగుటూరు మండలం వల్లూరమ్మ దేవస్థాంలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని దేవస్థానంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. తెల్లవారు జాము నుంచే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు వల్లూరమ్మ దేవస్థానానికి తరలి వచ్చారు. వరలక్ష్మీ వ్రతంలో భాగంగా మహిళలు సంప్రదాయ బద్ధంగా కలశాలను ఏర్పాటు చేసి, వాటిని అమ్మవారి స్వరూపంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు తదితర పూజా సామగ్రితో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. కుటుంబంలో సుఖ సంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ మహిళలు ప్రత్యేక వ్రతాలు, పూజలు నిర్వహించారు. వేలాది మంది మహిళలు ఈ వ్రత కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దీంతో దేవస్థాన పరిసర ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల సందడి కనిపించింది. భక్తుల కోసం దేవస్థానం నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా క్యూలైన్లు, పూజా కార్యక్రమాలు తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా దేవస్థాన పరిసర ప్రాంతం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగ ణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో దేవస్థానం పరిసరాలు సందడిగా మారాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ఎస్సై ఫణిభూషణ్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షించారు. వల్లూరమ్మ దేవస్థానంలో జరిగిన వరలక్ష్మీ వ్రతం అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరగడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబం సుఖసం తోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా దేవస్థానం పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా, మొత్తం ప్రాంతం ఆధ్యాత్మిక, పండుగ వాతావరణాన్ని తలపించింది.

# బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ పాఠశాలలో ఘనంగా ముందస్తు వినాయక చవితి వేడుకలు






**కందుకూరు శిఖరజనసాక్షి:** కందుకూరు పట్టణంలోని బీ.ఆర్.ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు హాజరై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గణనాథునికి వివిధ రకాల పత్రాలతో పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. చిన్నారుల భక్తిగీతాలు, సంప్రదాయ కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగ ణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా బీ.ఆర్.ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ..వినాయక చవితి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. విద్యా ర్థులు చిన్ననాటి నుంచే మన పండుగల విశిష్టతను, వాటి వెనుక ఉన్న మంచి సందేశాలను తెలుసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు. మట్టి గణపతి విగ్రహాలను ఉప యోగించడం ద్వారా ప్రకృతిని కాపాడే మంచి ఆలోచనను పిల్లల్లో పెం పొందించవచ్చు అని అన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ జి.బాలభాస్కరరావు మాట్లాడుతూ వినాయకుడు జ్ఞానం, వివేకం, విజయానికి ప్రతీకనీ, విద్యార్థులు గణేశుని ఆశీస్సులతో మంచి విద్యను అభ్యసిస్తూ, క్రమశిక్షణ, పట్టుదల, సత్ప్రవర్తనను అలవర్చుకోవాలని పేర్కొన్నారు. పండుగలను కేవలం వేడుకలుగా కాకుండా వాటి ద్వారా మన సంస్కృతి, సంప్రదా యాలను తెలుసుకునే అవకాశాలుగా మలచుకోవాలి" అని విద్యార్థులకు సూచించారు. పండుగల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్రకృతికి హాని కలగకుండా పర్యావరణహిత పద్ధతులను పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బెజవాడ నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రి ఈ-టెక్నో స్కూల్లో వైభవంగా ప్రీ గణేష్ చతుర్థి వేడుకలు








**కందుకూరు శిఖర జనసాక్షి:** ఓ.వి. రోడ్డులోని శ్రీ గాయత్రి ఈ-టెక్నో స్కూల్‌లో శుక్రవారం ప్రీ గణేష్ చతుర్థి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, నల్ల మట్టితో స్వయంగా వినాయక విగ్రహాలను తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సహజ సిద్ధమైన మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేయించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ వివిధ ఆకృతుల్లో వినాయక విగ్రహాలను రూపొందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ వినాయక చతుర్థి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముఖ్యమైన పండుగ అని తెలిపారు. విద్యార్థుల ఉత్సాహం, సృజనాత్మకతతో ప్రీ గణేష్ చతుర్థి వేడుకలు పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణాన్ని నెలకొల్పాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.